గోదావరి -బనకచర్లను ఎందుకు అడ్డుకోవట్లేదు

నీతి ఆయోగ్ సమావేశంలో రేవంత్ రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదు

కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కు బాధ్యత లేదా..?

: మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్ : గోదావరి – బనకచర్లను ఎందుకు అడ్డుకోవట్లేదు. నీతి ఆయోగ్ సమావేశంలో రేవంత్ రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదు. అక్రమంగా నీళ్లు తీసుకెళ్తుంటే ఆపే ప్రయత్నం చేయడం లేదు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కు బాధ్యత లేదా..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాష్ట్ర నీటి అవసరాలు కాపాడటంలో ఈ ప్రభుత్వం విఫలమైంది.. గోదావరి – బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. 200 టీఎంసీల గోదావరి జలాలు ఏపీ తరలించుకుపోయే కుట్ర జరుగుతుంది. తెలంగాణకు ఇంత జరుగుతుంటే సీఎం రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నారు. గోదావరి – బనకచర్లకు ఒక్క అనుమతి లేకుండానే ఏపీ ముందుకు వెళ్తుంది. కేంద్రం జుట్టు తన చేతిలో ఉందని చంద్రబాబు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన జలదోపిడీ.. కాంగ్రెస్ పాలనలో మళ్లీ మొదలైంది. నదీ పరివాహక ప్రాంతాల్లోని అన్ని రాష్ట్రాలు ఒప్పుకోవాలి. తెలంగాణ చేపట్టిన ప్రాజెక్టులకు చంద్రబాబు మోకాలు అడ్డుపెట్టారు. తెలంగాణ ప్రాజెక్టులు రద్దు చేయాలని కేంద్రానికి లేఖలు రాశారు. తెలంగాణ ప్రాజెక్టులు నిలిపివేయాలని ఏపీ 20కి పైగా లేఖలు రాసింది. పాలమూరు, భక్తరామదాసు, డిండిపై చంద్రబాబు లేఖలు రాశారు అని హరీశ్‌రావు గుర్తు చేశారు. తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వట్లేదని సీఎం అసెంబ్లీలోనే చెప్పారు. నీతి ఆయోగ్ సమావేశం బహిష్కరిస్తామని రేవంత్ రెడ్డి గతంలో చెప్పారు. నిన్న అందరి కంటే ముందే వెళ్లి సమావేశంలో కూర్చున్నారు. ఏ అనుమతులు లేని బీజేపీ తెలంగాణకు ద్రోహం చేస్తుంది. తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతు ఇవ్వరు. ఏపీ ప్రాజెక్టులకు అనుమతులు లేకున్నా నిధుల కనవవర్షం కురిపిస్తున్నారు. ఇదెక్కడి నీతి..? కిషన్ రెడ్డి చొరవచూపాలి. ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి. అక్రమ ప్రాజెక్టును నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాం. లేదంటే ఢిల్లీలోని సీడబ్ల్యూసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తాం. కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ నీతిని ఎండగడుతాం అని హరీశ్‌రావు హెచ్చరించారు.

మరో విషయంలో తెలంగాణకు బీజేపీ ద్రోహం చేస్తుంది. పోలవరం ద్వారా 80 టీఎంసీల నీటిని కృష్ణా పరివాహక ప్రాంతానికి మళ్లించినట్లు అయితే ఆ 80 టీఎంసీలు ఎగువన ఉన్న రాష్ట్రాలకు చెందుతాయని బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ఇచ్చింది. ఇందులో సుప్రీం కూడా తల దూర్చదు. తెలంగాణకు 45 టీఎంసీలు, కర్ణాటకుకు 25, మహారాష్ట్రకు 14 టీఎంసీలు అని చెప్పింది. సీడబ్ల్యూసీకి కర్ణాటక దరఖాస్తు చేసింది.. అప్పర్ భద్ర ప్రాజెక్టుకు 25 టీఎంసీలు కేటాయించింది. మహారాష్ట్రకు చెందిన 14 టీఎంసీలు ఇచ్చింది. అదే పద్ధతుల్లో 45 టీఎంసీలు మాకు దక్కాలని, పాలమూరు ఎత్తిపోతలకు కేటాయించండి అంటే డీపీఆర్ వాసప్ పంపుతారు. ఇది బీజేపీకి తెలంగాణ పట్ల ఉన్న వివక్షకు నిదర్శనం. ఇంత దుర్మార్గంగా ఎట్ల వ్యవహరిస్తారు. అదే బచావత్ ఇంకో మాట చెప్పింది. 90 టీఎంసీల కంటే ఎక్కువ తీసుకుపోయినా.. ఇదే నిష్పత్తిలో ఎగువన ఉన్న రాష్ట్రాలకు కృష్ణా నదిలో నీటి వాటాలు కేటాయించాలని చెప్పింది. ఈ లెక్కన తెలంగాణకు 112 టీఎంసీలు రావాలి. అంటే మొత్తం 157 టీఎంసీలు తెలంగాణకు కలిపి ఇవ్వాలి. దీంతో కల్వకుర్తి, డిండికి నికర జలాలు కేటాయించుకోవచ్చు అని హరీశ్‌రావు తెలిపారు.

రెడ్ కార్నర్ నోటీస్‌పై అమెరికా కసరత్తు

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం..

ప్రభాకర్ రావు ను భారత్ రప్పించే యత్నం ముమ్మరం

హైదరాబాద్ : తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు ను భారత్ రప్పించే ప్రయత్నంలో కీలక ముందడుగు పడింది. ఇంటర్‌పోల్ గత మార్చి 10న జారీ చేసిన రెడ్‌కార్నర్ నోటీసులు అమలు ప్రక్రియను తాజాగా అమెరికా ప్రభుత్వం ప్రారంభించినట్లు సమాచారం. ప్రభాకర్ రావును అమెరికా నుంచి భారత్ పంపించేందుకు యూఎస్ హోం ల్యాండ్ సెక్యూరిటీ ఏజెన్సీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. గతంలో తనను రాజకీయ శరణార్థి గా గుర్తించాలని ప్రభాకర్ రావు అమెరికా ప్రభుత్వాన్ని కోరిన విషయం తెలిసిందే. దీంతో ప్రభాకర్ రావును రాజకీయ శరణార్థిగా గుర్తించకుండా ఫోన్ ట్యాపింగ్ అక్రమాలను నివేదిక రూపంలో దర్యాప్తు బృందం (సిట్) పంపింది.

రాష్ట్రంలో కీలక వ్యక్తుల వ్యక్తిగత సంభాషణల్ని అక్రమంగా ట్యాప్ చేయించడంలో ఆయన పాత్ర గురించి సిట్ అధికారులు నివేదికలో పొందుపరిచారు. ఈ క్రమంలోనే యూఎస్ హోం ల్యాండ్ సెక్యూరిటీ ఏజెన్సీ ప్రభాకర్ రావును భారత్‌కు డిపోర్ట్ చేసేందుకు కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. మరోవైపు అతను తప్పించుకునేందుకు ఉన్న దారులను క్లోజ్ చేసేందుకు సిట్ టీమ్ బలంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ కేసులో ఏ1గా ఉన్న ప్రభాకర్‌రావు ఫోన్ ట్యాపింగ్ ఇష్యూ బయటకురావడంతో ఆయన దేశం దాటి అమెరికా వెళ్లిపోయారు. ఈ క్రమంలో పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై నాంపల్లి కోర్టు నిర్ణయం వెలువరిస్తూ న్యాయస్థానం ఎదుట హాజరుకావాలని ప్రభాకర్‌రావును కోర్టు ఇదివరకే ఆదేశించింది. ఒక వేళ హాజరుకాకుండా తప్పించుకుని తిరిగితే అఫెండర్‌గా ప్రకటిస్తామని హెచ్చరించింది. జూన్ 20 లోపు హాజరు కావాలని ప్రభాకర్ రావుకు నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

93.87 శాతం పాస్

ఈసెట్ ఫలితాలు విడుదల..

హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో టీజీ ఈసెట్ ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్ణ రెడ్డి విడుదల చేశారు. ఈసెట్ ఫలితాల్లో 93.87 శాతం ఉత్తీర్ణత సాధించారు. మెటలార్జికల్ ఇంజినీరింగ్, బీఎస్సీ మ్యాథ్స్, ఫార్మసీలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ కుమార్, ఆచార్య చంద్రశేఖర్ పాల్గొన్నారు. బీఎస్సీ మ్యాథ్స్‌లో సంతోష్ కుమార్, కెమికల్ ఇంజినీరింగ్‌లో లెంక తేజ సాయి, సివిల్ ఇంజినీరింగ్‌లో గోల్కొండ నిఖిల్ కౌశిక్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో శ్రీకాంత్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ కట్లే రేవతి, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో కాసుల శ్రావణి, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్‌లో రాపర్తి చందన, మెకానికల్ ఇంజినీరింగ్‌లో పోతుగంటి కార్తిక్, మెటలర్జికల్ ఇంజినీరింగ్‌లో తోట సుబ్రహ్మణ్యం, మైనింగ్ ఇంజినీరింగ్‌లో కుర్మా అక్షయ, ఫార్మసీలో ఐలి చందన మొదటి ర్యాంకు సాధించారు.

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐక్యత చాటిన భారత్

ఆపరేషన్ సింధూర్ పేరుతో ఉగ్రవాద స్థావరాల ధ్వంసం

పాకిస్థాన్, ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రాంతాల్లో దాడులు

దళాల ధైర్యసాహసాలు ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేశాయి

మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ : ఆపరేషన్ సింధూర్ చేపట్టి మన దళాలు ప్రదర్శించిన ధైర్యసాహసాలు ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేశాయని ప్రధాని మోదీ అన్నారు. ఆదివారం మన్‌కీ బాత్ 122వ ఎపిసోడ్‌లో మోదీ మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్థాన్ లోని, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన తర్వాత మోదీ మన్‌కీ బాత్‌లో ప్రసంగించడం ఇదే తొలిసారి. ఉగ్రవాదనికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో ఆపరేషన్ సింధూర్ కొత్త ఉత్సాహాన్ని నింపిందని ప్రధాని అన్నారు. మన దళాలు ప్రదర్శించిన ధైర్యసాహసాలు ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేశాయని చెప్పారు. దేశ ప్రజలను ఆపరేషన్ సింధూర్ ఎంతగానో ప్రభావితం చేసిందని, అనేక కుటుంబాలు దీనిని తమ జీవితాల్లో భాగం చేసుకున్నాయని తెలిపారు. ఆపరేషన్ సమయంలో జన్మించిన చిన్నారులకు పలువురు సింధూర్ అని పేర్లు పెట్టుకున్నారని చెప్పారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశమంతా ఏకమైందని, నేడు ప్రతి భారతీయుడు ఉగ్రవాదాన్ని అంతం చేయాలనే సంకల్పంతో ఉన్నాడని ఆయన అన్నారు. ఆపరేషన్ సింధూర్ కేవలం సైనిక చర్య మాత్రమే కాదని, మన ధైర్యం, దేశభక్తితో నిండిన నవభారతానికి నిదర్శనమని ప్రధాని వ్యాఖ్యానించారు. అనేక నగరాలు, గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు తిరంగా యాత్రలు నిర్వహించారని చెప్పారు. పౌర రక్షణ వలంటీర్లుగా మారేందుకు అనేక నగరాల నుంచి యువత ముందుకు వచ్చారని తెలిపారు. అదేవిధంగా దేశంలో మావోయిస్టుల హింసాత్మక చర్యలు క్రమంగా తగ్గుతున్నాయని తెలిపారు. దంతెవాడ ఆపరేషన్‌లో జవాన్లు చూపిన సాహసాన్ని ఆయన కొనియాడారు.నక్సలిజానికి వ్యతిరేకంగా పోరాటం ఇకపై కొనసాగుతుందని ప్రధాని స్పష్టంచేశారు. నక్సలిజం నిర్మూలనలో గర్వించే విజయం సాధించామన్నారు. తెలంగాణలోని సంగారెడ్డి మహిళల గురించి కూడా ప్రధాని మోదీ మన్‌కీ బాత్‌లో ప్రస్తావించారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగాన్ని ఆయన ప్రశంసించారు.

దళాల పరాక్రమంపై సీఎంలు ప్రశంసలు

న్యూఢిల్లీ : ప్రధాని మోదీ నాయకత్వంలో ఆపరేషన్ సిందూర్ సందర్భంగా సైనిక దళాలు చూపిన పరాక్రమాన్ని ప్రశంసిస్తూ ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ఓ తీర్మానం ఆమోదించింది. ఈ తీర్మానాన్ని ప్రతిపాదించిన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్ నాథ్ శిందే ఆపరేషన్ సిందూర్ భారతీయుల ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని కొనియాడారు. ప్రధాని మోదీ ఎల్లప్పుడూ సైనిక దళాలకు మద్దతుగా నిలిచారని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులకు, వారిని పెంచిపోషిస్తున్న వారికి గట్టి గుణపాఠం చెప్పినట్లు తెలిపారు. ఒకరోజు జరిగే ఈ సమావేశంలో ప్రధాని మోదీతో పాటు కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, జేపీ నడ్డా, 19రాష్ట్రాల సీఎంలు, చాలామంది ఉప ముఖ్యమంత్రులు కూడా పాల్గొంటున్నారు.

కవిత పార్టీ పెట్టడం ఊహాగానాలే

కొత్త పార్టీ పెట్టినప్పుడు మాట్లాడతా

మా అందరికీ కేసీఆర్‌యే బాస్

కవిత బీఆర్ఎస్‌లోనే

పార్టీలో ఎలాంటి విభేదాలు లేవు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పెడుతుందనే వార్తలను కొట్టిపారేశారు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్. ఆదివారం ఆయన కవిత కొత్త పార్టీ పెడతారనే ఊహాగానాలపై స్పందిస్తూ.. ఈ వార్తలు కేవలం ఊహాగానాలేనని క్లారిటీ ఇచ్చారు. కొత్త పార్టీ పెట్టినపుడు మాట్లాడతానని అన్నారు. బీఆర్ఎస్ కు ఎప్పటికీ కేసీఆర్ మాత్రమే నాయకుడని స్పష్టం చేశారు. కవిత కేసీఆర్‌కు రాసిన లేఖ ద్వారా బీఆర్ఎస్‌లో అంతర్గత విభేదాలను బయటపడ్డాయని కాంగ్రెస్, బీజేపీ నేతలు ఆరోపిస్తూ.. కవిత కొత్త పార్టీ పెడతారంటూ తీవ్ర చర్చలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కమలాకర్ మాట్లాడుతూ.. కవిత బీఆర్ఎస్‌లోనే కొనసాగుతారని, పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ ఈ ఊహాగానాలను రాజకీయ లబ్ధి కోసం వాడుతోందని విమర్శించారు. కవిత లేఖలో కేసీఆర్‌పై విమర్శలు చేయడం, బీజేపీతో రహస్య ఒప్పంద ఆరోపణలు చేయడం వంటివి బీఆర్ఎస్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నప్పటికీ ఆమె బీఆర్ఎస్‌కు విధేయురాలని పేర్కొన్నారు.

4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ

జపాన్‌ను అధిగమించిన భారత్.. త్వరలో జర్మనీని అధిగమిస్తాం

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్ : 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థతో మనం ఇప్పుడు ప్రపంచంలోనే 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను కలిగి ఉన్నామని కేంద్ర మంత్రి, బీజేపీ స్టేట్ చీఫ్ కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతా ద్వారా వివరాలు తెలిపారు. 4 ట్రిలియన్ డాలర్లతో జపాన్‌ను అధిగమించి భారత్ 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని, త్వరలో జర్మనీని కూడా అధిగమించనుందని తెలిపారు. మనకంటే ముందు స్థానంలో అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. రాబోయే రెండు సంవత్సరాలలో భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ఐఎంఎఫ్ కూడా అంచనా వేస్తోందని తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ 2025 లో 6.2 శాతం, 2026 లో 6.3 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేయడం జరిగిందని వెల్లడించారు. ఇది ప్రపంచంలో, ప్రాంతీయంగా మనతో పోటీ పడే దేశాల కంటే ఎక్కువ అని తెలిపారు. ఐఎంఎఫ్ ప్రపంచ ఆర్థిక వృద్ధిని 2025 లో 2.8 శాతంగా, 2026 లో 3.0 శాతంగా అంచనా వేసిందని వెల్లడించారు.

అన్నలు వదిలిన బాణాలు.. వారిపైనే గురి..

పదవుల పంపకాల్లో తేడాలు

కేటీఆర్ నాయకత్వంపై కవిత ప్రశ్నించరా?

ఎంపీ లక్ష్మణ్

హైదరాబాద్ : బీజేపీ నేత, రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్ కేసీఆర్, వైఎస్ కుటుంబాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. తాజాగా తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం గా మారిన కవిత లేఖ వ్యవహారంపై స్పందించారు. కేసీఆర్ వైఎస్ కుటుంబాలల్లో తలెత్తిన పలు అంశాలను లేవనెత్తారు. ఇందులో భాగంగా.. ఆస్తులు, పదవుల పంపకాల్లో తేడాలు వచ్చాయంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు రాజకీయాల్లోకి అన్నలు వదిలిన బాణాలు.. ఆస్తులు, పదవుల పంపకాల్లో తేడాలు రావడంతో.. ఇప్పుడు అన్నలపైనే గురిపెట్టారని లక్ష్మణ్ ఎద్దేశ చేశారు.

రాష్ట్రంలో ఎమ్మెల్సీ కవిత కుట్రలు పని చేయవని, కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ ఎలా బయటికి వచ్చిందని ప్రశ్నించారు. తెలంగాణ బీఆర్ఎస్‌లో కేటీఆర్ నాయకత్వాన్ని కవిత వ్యతిరేకిస్తున్నారా అని ప్రశ్నించారు. పదేళ్లుగా సామాజిక న్యాయం గురించి కవిత మాట్లాడలేదు. కానీ తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందనే భయంతో కవితతో కాంగ్రెస్ పార్టీ ఇటువంటి పావులు కదుపుతోందని లక్ష్మణ్ ఆరోపించారు. ఆంధ్రలో షర్మిలను కూడా కాంగ్రెస్ ఇలానే వాడుకుందని, అస్తిత్వం కోసమే కవిత పోరాటం చేస్తుందని, లిక్కర్ కేసుల్లో ఉన్న వారిని ప్రజలు స్వాగతించరని గత ఎన్నికల్లో కవితకు సానుభూతి కూడా రాలేదని ఎద్దేవా చేశారు.

కవిత లేఖతో బీఆర్ఎస్‌కే నష్టం

దీంతో బయటపడిన బీజేపీ, బీఆర్ఎస్ రహస్య ఒప్పందం

కొడుకు ఉండగా కూతురికి పగ్గాలు దక్కవు : జగ్గారెడ్డి

వరంగల్ : ఎమ్మెల్సీ గొడవ వల్ల గులాబీ పార్టీకే తీరని నష్టమని కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కేసీఆర్ కు రాసిన ఆరు పేజీల చేతితో రాసిన లేఖ ఇంకా రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తూనే ఉంది. అయితే ఈ లేఖపై కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి స్పందించారు. ఆదివారం వరంగల్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కవిత లేఖ వల్ల కాంగ్రెస్ కు వచ్చిన నష్టం ఏమీ లేదని స్పష్టం చేశారు. 2023 శాసనసభ ఎన్నికల్లో 64 సీట్లతో అధికారంలోకి వచ్చిన తమ పార్టీ ఆరు గ్యారంటీలు, సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో బలంగా ఉందన్నారు. అలాంటి లేఖలు వంద పుట్టుకొచ్చినా కాంగ్రెస్కు ఏమీ జరగదన్నారు. కవిత లేఖ బీఆర్ఎస్‌లో కేసీఆర్ కుటుంబ "పంచాయితీ"ని బయటపెట్టిందన్నారు. కొడుకు కేటీఆర్ ఉండగా వారసత్వం కూతురుకు ఎలా దక్కుతుందని వ్యాఖ్యానించారు. ఈ లేఖ ద్వారా బీఆర్ఎస్ – బీజేపీతో రహస్య ఒప్పందాలు బయటపడ్డాయని ఆరోపించారు. ఈ వివాదం తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణాన్ని కల్పించిందని జగ్గారెడ్డి నొక్కిచెప్పారు.

కాళేశ్వరంలో భారీ ట్రాఫిక్ జాం

15 కిమీల వరకు నిలిచిన వాహనాలు

పోలీసుల అనాలోచిత నిర్ణయాలతో 5 గంటలు పాటు భక్తుల ఇక్కట్లు

చిన్నారులు, వృద్ధులతో వచ్చిన కుటుంబాల ఇబ్బందులు తీవ్రతరం

కాళేశ్వరం : కాళేశ్వరం లో ఈనెల 22 నుండి జరుగుతున్న సరస్వతీ పుష్కరాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ పుష్కరాలు రెపతితో ముగుస్తుండటంతో భక్తులు భారీగా కాళేశ్వరానికి పోటెత్తారు. భారీ సంఖ్యలో భక్తులు వాహనాల్లో రావడంతో మహాదేవపూర్- కాళేశ్వరం రూట్లో తీవ్రమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కాళేశ్వరం రూట్‌ను వన్-వే మార్గంగా మార్చడంతో దాదాపు 15 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించి పోయింది. అయితే ఈ ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి పోలీసులు తీసుకున్న ఓ అనాలోచిత నిర్ణయంతో భక్తులు 5 గంటలకు పైగా అడవి ప్రాంతంలో చిక్కుకుపోయి, ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనాల రద్దీ సమస్యను నియంత్రించేందుకు పోలీసులు ట్రాఫిక్‌ను అటవీ ప్రాంతంలోకి మళ్లించారు. ఇది భక్తులను మరింత గందరగోళంలో పడేయడమే కాకుండా తీవ్ర అసౌకర్యం కలిగించింది. అడవిలోకి మళ్లించిన ట్రాఫిక్ వల్ల రోడ్లు ఇరుకుగా ఉండటం, లైటింగ్ లేకపోవడం, గూగుల్ మ్యాప్‌లలో సరైన రూట్ సమాచారం లేకపోవడంతో భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులతో వచ్చిన వారు తీవ్ర ఇక్కట్లు పడ్డారు.

Edited, Printed, Published and Owned by PURAM MAHESHWAR Printed at HARI HARA ART PRINTERS,H.No.6-185,Toopran,Dist.Medak, Telangana-502336. and Published at H.No. 4-50/18,Kallakal, Vill-Kallakal,(PO). Kadlakal,(M) Manoharabad, Dist.Medak-Telangana -502336.
Editor: PURAM MAHESHWAR. RNI. No:TELTEL/2006/17154. Cell:8008609999